జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
గురువారం | 12 | మార్చి | 2026 ◆ పేజీలు : 3

## పేదల ఇంటి కల నెరవేర్చడమే రేవంత్ రెడ్డి సర్కారు ధ్యేయం"

- అమ్మపాలెం లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం చేసిన ఎమ్మెల్యే రాగమయి"



**వేంసూరు మార్చి11( ప్రజాజ్యోతి) న్యూస్:** పేదల ఇంటి కల నెరవేర్చడమే రేవంత్ రెడ్డి సర్కారు ధ్యేయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిదయానంద్ తెలిపారు. బుధవారం వేంసూరు మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామం లో పుచ్చ రమేష్ నాగమణి దంపతులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు ను రాగమయి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించిన చిత్రపటాన్ని ఎమ్మెల్యే బహుకరించారు. ఈ కార్యక్రమంలో:కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ పెద్దగొల్ల ప్రసన్న ధర్మారావు,సీనియర్ నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి ఎర్రా సత్యనారాయణ,అట్లూరి సత్యనారాయణరెడ్డి,పుచ్చకాయల కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 9 న ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశాలు జరుపుకోవాలి

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొంగులేటి,తుమ్మల
- దళారులకు చెక్ పెడుతూ అర్హులకు అండగా నిలిచిన ప్రభుత్వం
- వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు
- 311 మందికి భూదాన్ భూమిలో భూమి పట్టాతో పాటు ఇందిరమ్మ ఇండ్లు
- 101 మంది అర్హులకు వారి సొంతూర్లలో ఇందిరమ్మ ఇండ్లు
- యుద్ధ ప్రాతిపదికన మౌళిక వసతుల కల్పన పనులు
- దళారుల నుంచి బాధితులకు డబ్బు వసూలు చేసి అందిస్తాం
- వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** డిసెంబర్ 9 న సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా వెలుగుమట్ల భూదాన్ భూముల లబ్ధిదారులు సామూహిక గృహప్రవేశం జరుపుకోవాలని, ఆ దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపడుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి,వ్యవసాయ,మార్కెటింగ్,సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావులు వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇండ్లు ఉండాలని నిర్ణయం తీసుకుని తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. హౌసింగ్ శాఖ ద్వారా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామన్నారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తుందని తెలిపారు. పేదలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో పని చేస్తున్న ప్రభుత్వంపై కొంత మంది కావాలని బురద చల్లుతున్నారని తెలిపారు.పేదల నిస్సహాయత ఆసరాగా తీసుకొని సమాంతరమైన వ్యవస్థ ఏర్పాటు

మిగతా 2 లో...

# పేదల బియ్యం... పక్కదారి

- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు,రాజకీయ నేతలు!
- జోరుగా సాగుతున్న రేషన్ దందా



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రభుత్వం నిరుపేదల ఆకలి తీర్చడం కోసం రూపాయికే కిలో చౌక దుకాణం పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ, క్షేత్ర స్థాయిలో ఈ బియ్యం పేదల కడుపు నింపడం కంటే, అక్రమార్కుల జేబులు నింపడానికే ఎక్కువగా ఉపయోగపడుతోంది. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా రేషన్( పిడిఎస్) బియ్యం అక్రమ రవాణా మునుపెన్నడూ లేని విధంగా జోరుగా సాగుతోంది.పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి చోటా మాఫియా ముఠాలు బహిరంగంగానే ఈ దందాను నడిపిస్తున్నాయి. అధికారుల మౌనం ఈ అక్రమ వ్యాపారం ఇంత నిర్భయంగా సాగడానికి ప్రధాన కారణం రాజకీయ నాయకుల అండదండలే అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఉన్నత స్థాయి నేతల వరకు ఈ దందాలో వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, ఈ వ్యవహారాన్ని అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీస్, పౌర సరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటూ, అసలు సూత్రధారులను వదిలేసి కేవలం డ్రైవర్లపై కేసులు నమోదు చేసి మమ అనిపిస్తున్నారు.

**రేషన్ (పిడిఎస్ )బియ్యం స్వాహా – సాగుతున్న తీరు**

సేకరణ: దళారులు గ్రామాలలోని అమాయక ప్రజల వద్ద

మిగతా 2 లో...

## ప్రభుత్వం ఇచ్చిన గడువుకు ముందే వెలుగుమట్ల నిర్వాసితులకు విముక్తి

- వెలుగుమట్ల భూదాన్ పేదలకు న్యాయం చేసిన మంత్రులు భట్టి విక్రమార్క మల్లు,పొంగులేటి శ్రీనివాస రెడ్డి,తుమ్మల నాగేశ్వరరావు
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో వెలుగుమట్ల భూదాన్ నిర్వాసితుల గురించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తుమ్మల నాగేశ్వరరావులు సహచర మంత్రి వర్యులతో కలిసి వెలుగుమట్ల నిర్వాసితులకు చట్ట భద్దత కల్పించారని అర్హులైన నిరుపేదలకు న్యాయం చేసిన నిజమైన ప్రజా ప్రభుత్వం అని,మాట ఇస్తే మడమ తిప్పని ప్రభుత్వం అని అన్నారు.దళారుల ఉచ్చులో చిక్కి గూడు కోల్పోయి చీకట్లో మగ్గుతున్న వెలుగుమట్ల బాధితుల సమస్యను మన జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,తుమ్మల నాగేశ్వరరావులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధికారులను

మిగతా 2 లో...

# ఫ్రెండ్లీ ఎమ్మెల్యేగా పేరుబందిన రామదాస్ నాయక్

**పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్దే ధ్యేయంగా దూసుకుపోతున్న పురపాలక సంఘం**

**8వ వార్డుని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం – ఎమ్మెల్యే, చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్**




**ఖమ్మం వైరా: మార్చి 11 ప్రజా జ్యోతి** ఫ్రెండ్లీ ఎమ్మెల్యేగా పేరుపొందిన మాలోతు రాందాస్ నాయక్ ఆసక్తికరంగా ప్రసంగించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గెలిచిన కౌన్సిలర్ చిలక చిన్న కోటయ్య బుధవారం ఏర్పాటు చేసిన వార్డు అభివృద్ధి, పురపాలక సంఘ కౌన్సిలర్ల సన్మాన సభకి నందిగామ మనోహర్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తనకు రాజకీయాలు ఎన్నికల వరకే ఉంటాయని, ఆ తర్వాత అభివృద్ధి తన ధ్యేయమన్నారు. ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించి గెలిపించిన వైరా ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు ప్రత్యేకంగా కేంద్ర బిందువు అయినా వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానన్నారు. జిల్లాలోనే మోడ్రన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని తెలిపారు ఇప్పటికే 15 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభమవుతున్నాయని, ఇంకా నిధులు తీసుకొచ్చి అన్ని రకాలుగా వైరా పురపాలకాన్ని అభివృద్ధి చేస్తానన్నారు పార్టీలకతీతంగా వార్డులను అభివృద్ధి చేయటంలో ప్రత్యేక దృష్టి పెడతారని తెలిపారు. 8వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి చిలక చిన్న కోటయ్య కౌన్సిలర్గా గెలుపొందినప్పటికీ తాము ప్రతిపక్ష పార్టీగా చూడటం లేదని, అధికార పార్టీ కౌన్సిలర్ల వార్డులలో జరిగే అభివృద్ధి ఇక్కడ కూడా జరుగుతుందని ప్రతి సమస్యను పరిష్కరించడానికి తాను ముందు ఉంటానని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లను తాను ఎప్పటికీ చిన్నచూపు చూడనని సమాన అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. చిన్నకోటయ్య ఏర్పాటు చేసిన అభినందన సభలో తాను పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆయన కూడా పార్టీలకతీతంగా అందరు కౌన్సిలర్లను పిలిపించి సన్మానించడం అభినందనదాయకమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న మరో రెండున్నర ఏళ్లు వైరా ప్రాంతానికి అభివృద్ధి మంత్రంగా పని చేస్తానని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆశీస్సులతో అధిక నిధులు తీసుకొచ్చి అద్భుతంగా తీర్చిదిద్దుతానని చేస్తానన్నారు. అంతకుముందు డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ, తాను ఈ ప్రాంత వాసినని, మున్సిపాలిటీ అభివృద్ధికి తన తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందన్నారు. చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ, రాబోవు 5 ఏళ్లలో వైరా స్వరూపాన్ని మార్చేస్తానన్నారు. ఎమ్మెల్యే సహకారంతో వైస్ చైర్మన్ కౌన్సిలర్ల సమన్వయంతో ప్రత్యేక మార్క్ ఉంటుందని ఆమె చెప్పారు. నిధులు ఆలస్యమైన అవసరమైతే సొంత ఖర్చులతో సమస్యల్ని తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. ఉప చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ, తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని, ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా, కష్టపడి పనిచేసి ప్రజల మన్ననలు పొందుతామని తెలిపారు. తమ పాలనలో అవినీతి లేని పురపాలక పరిపాలన కొనసాగుతుందని అన్నారు. అన్ని విధాల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తమ కృషి కొనసాగుతుందని తెలిపారు. మాజీ ఎంపీపీ కట్ల కృష్ణ కృష్ణ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ నాయకత్వంలో పురపాలక సంఘాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఉన్నతమైన నాయకులు పాలకవర్గానికి ప్రతినిధులుగా రావడం వైరా మున్సిపాలిటీకి గొప్ప అవకాశం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ దంపతులకు, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కి, హాజరైన కౌన్సిలర్ అందరికీ ఎమ్మెల్యే శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తర్వాత ఎమ్మెల్యేని కౌన్సిల్ సభ్యులంతా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల అసోసియేషన్ సెల్లు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ 1 2 8 11 12 15 16 కౌన్సిలర్లు మూడు శ్రీకాంత్ నిమ్మ తోట శ్రావణి దొంతబోయిన వెంకటేశ్వర్లు మాదినేని సునీత, నల్లమోతు శైలజ , బలరాం కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకట నర్సిరెడ్డి ఏఎంసి చైర్మన్ బొళ్ళ గంగారావు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు టౌన్ అధ్యక్షులు సురేష్ కాంగ్రెస్ నాయకులు పమ్మి మహేష్, వేముల రత్నాకర్, గద్వాల రవి మాజీ ఎంపీపీ జయమ్మ సంసోను ఏలియా తదితరులు పాల్గొన్నారు

# డిసెంబర్ 9 న ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశాలు జరుపుకోవాలి





(మొదటి పేజీ తరువాయి...)

చేసి త్రాగునీరు,బడి,విద్యుత్ సదుపాయం వంటి సౌకర్యాలు లేకుండా పేదలు భయం లోనే బ్రతికేలా విష వలయం పన్నారని డిప్యూటీ సీఎం అన్నారు.పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం నేడు పట్టాలు అందిస్తుందని అన్నారు. పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంతమంది కావాలని దురుద్దేశంతో సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం చేస్తున్నారని, ఎవరు ఏం ప్రచారం చేసిన పేదలకు న్యాయం జరగాలనీ అంతిమ లక్ష్యాన్ని సాధించే దిశగా తాము పని చేస్తున్నట్లు తెలిపారు.రాజకీయ దురుద్దేశాలు, ప్రభుత్వాన్ని విమర్శించారు అనే పట్టింపులు లేకుండా అర్హులైన 412 మంది నిరుపేద కుటుంబా లకు ఒకేసారి ఇందిరమ్మ ఇండ్లను నేడు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదలను అనేకమంది అనేకసార్లు వచ్చి బెదిరించే వారని, భయాందోళనల మధ్య గతంలో వారు గడిపారని, ఆ పరిస్థితికి నేడు ప్రజా ప్రభుత్వం స్వస్తి పలికిందని తెలిపారు.ప్రభుత్వం అందించిన పట్టాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భూమి పూజ కార్యక్రమం గురువారం జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 9 న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఇతర మౌళిక వసతులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించు కోవాలన్నారు.పేదల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్మెంట్ ను పది సంవత్సరాల పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసం చేసిన ప్రతిపక్షాలు ప్రశ్నించడం హాస్యాస్పదమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత తమకు ఉందా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని డిప్యూటీ సీఎం హితవు పలికారు.పేదల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేసిన ప్రతి ఒక్కరికి కఠిన శిక్ష పడేలా చూస్తామని, ప్రతి ఒక్క రూపాయి నిందితుల నుంచి వసూలు చేసి బాధితులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యే విధంగా మన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తుందని తెలిపారు.వెలుగు మట్ల భూదాన్ భూములలో పేదలకు పంచగా మిగిలిన భూమిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కూల్స్ పక్క భవనాలకు ఆ స్థలం ఉపయోగిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.వెలుగుమట్ల లబ్ధిదారులు నేటి నుంచి నిర్భయంగా ఉండాలని, మోడల్ కాలనీగా తయారు చేసి అందించే బాధ్యత తాము తీసుకుంటామని తెలిపారు.రెవెన్యూ, హౌజింగ్,సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మార్చి 1, 2026 నాడు ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలైన లబ్దిదారులకు సీఎం, కేబినెట్ సహచరుల సహకారంతో 311 మంది ఇంటి స్థలం లేని వారికి ఇండ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రం, సొంత ఊరిలో స్థలం ఉన్న మరో 101 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి భేషజాలు లేకుండా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.ఫిబ్రవరి 24న వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేతలు జరిగిన తర్వాత ప్రధాన ప్రతిపక్ష నాయకులు వచ్చి మొసలి కన్నీరు కార్చారని మంత్రి ఎద్దేవా చేశారు. గత పాలకులకు విశాల హృదయం లేదని, తమ ప్రభుత్వం ప్రజల కష్టాలను చూసి చలించి నేడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రతిపక్షానికి లేదని స్పష్టం చేశారు.ప్రతిపక్ష నాయకులు మా ప్రభుత్వం వస్తుందని పగటి కలలు కంటున్నారని, అనేక ఎన్నికల ఫలితాలు వస్తున్నప్పటికీ మార్పు చెందకుండా కక్ష పూరిత మనస్తత్వంతో ప్రవర్తిస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాల పాటు పేదలను పట్టించు కోలేదని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదలకు ఇస్తుందని అన్నారు.త్రాగునీరు,రోడ్లు,ఫంక్షన్ హాల్,షాపింగ్ కాంప్లెక్స్,స్కూల్,విద్యుత్ సరఫరా వంటి అనేక మౌళిక వసతుల వసతుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. గత 8 సంవత్సరాలుగా పేదలు ఇబ్బందులు పడిన మాట వాస్తవమేనని, ఆ సమస్యలకు నేడు పరిష్కారం లభిస్తుందని,అర్హులైన బాధితులు ఎవరైనా ఇంకా మిగిలి ఉంటె వారికి కూడా తమ ప్రభుత్వం తప్పని సరిగా ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు.పేదలను మోసం చేసి దళారులు వసూలు చేసిన డబ్బు ఒక్క రూపాయి కూడా వదలకుండా పూర్తి స్థాయిలో వసూలు చేసి బాధితులకు అందించాలని మంత్రి పోలీస్ కమీషనర్ ను ఆదేశించారు.వ్యవసాయ,మార్కెటింగ్, సహకార,చేనేత,జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ★ పేదలను కొంత మంది ముఠాగా ఏర్పడి మోసం చేస్తే గత పాలకులు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు పేరిట ఇచ్చిన పత్రాలు బోగస్ అని, సిసిఎల్ఏ ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.లాఠీ ఛార్జ్ లేకుండా అక్రమ నిర్మాణాలు కూల్చివేసి దగా కోరులను తరిమివేశామని మంత్రి తెలిపారు. నిరుపేదలకు వెలుగు మట్ల భూదాన్ భూములలో భూ పట్టాలు పంపిణీ చేస్తున్నామని, పిల్లల భవిష్యత్తు కోసం ఇక్కడ మోడల్ స్కూల్ నిర్మిస్తామని చెప్పారు.యుద్ధ ప్రాతిపదికన రహదారులు, విద్యుత్, మంచి నీరు, రోడ్లు, డ్రైయిన్ వంటి మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేస్తామన్నారు.డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి గారిని తీసుకువచ్చి భూ దాన్ భూములలో నూతనంగా చేపట్టే 311 మంది లబ్ధిదారుల కాలనీ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుపేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో కొంత ఇబ్బంది పడటం జరిగిందని ఆయన తెలిపారు.అనధికారికంగా నిరుపేదలు నివసించే దుస్థితి రాకుండా అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తామని అన్నారు. 311 మంది లబ్ధిదారులే కాకుండా మరో 101 మంది నిరుపేదలకు వారి సొంత ఊరిలో ఉన్న స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసామని అన్నారు.చివరి లబ్ధిదారుడి వరకు ఇండ్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వెలుగుమట్ల కాలనీ అద్భుతంగా తీర్చి దిద్దుతామని, పేదల దగ్గర డబ్బులు వసూలు చేసిన దళారుల వివరాలు పోలీసులకు అందించాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ వెలుగు మట్ల భూదాన్ భూములకు సంబంధించి పెద్ద భూ మాఫియా నడుస్తుందని, ప్రజల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. 311 మంది నిరుపేదలకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.నిరుపేదలు నివసించే కాలనీలో ఇండ్లతో పాటు పార్క్, రోడ్డు, స్కూలు, విద్యుత్తు, త్రాగు నీరు వంటి మౌళిక సదుపాయాల పనులు కూడా వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు,నాయుడు సత్యనారాయణ,ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ,ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య,అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ.పద్మశ్రీ,ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు,లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల నిర్వాసితులకు విముక్తి

(మొదటి పేజీ తరువాయి...)

అప్రమత్తంచేసి రాజకీయాలకు తావులేకుండా అత్యంత పారదర్శకమైన సర్వేను పూర్తి చేయించి 412 కుటుంబాలను నిజమైన నిరుపేదలగా గుర్తించి అందులో 311 కుటుంబాలకు ఇంటి స్థలం పట్టాతో పాటు ఇందిరమ్మ ఇంటి మంజూరి, ఇంటి స్థలం ఉన్న 101కుటుంబాల కి ఇందిరమ్మ ఇంటి మంజూరి పత్రాలు అందజేస్తారని అన్నారు. తద్వారా 412 కుటుంబాలకు శాశ్వత గృహ యోగం కలగబోతున్నదని అన్నారు.అదే విధంగా పేదలకు అండగా జిల్లా మంత్రులు పేదల రక్తం తాగే దళారి వ్యవస్థపై ఉక్కుపాదం మోపి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా,లంచాలకు తావులేకుండా నేరుగా మంత్రులే బాధితుల చేతికి పట్టాలు ఇవ్వడం జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని, ఇచ్చిన గడువుకు ముందే బాధితులకు న్యాయం జరగడంతో హర్షం వ్యక్తంచేసిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

## పేదల బియ్యం 'పక్క'దారి

(మొదటి పేజీ తరువాయి...)

నుంచి కిలోకు రూ. 10 నుండి రూ. 15 చెల్లించి రేషన్ (పిడిఎస్ )బియ్యాన్ని సేకరిస్తున్నారు.రీ–సైక్లింగ్: సేకరించిన బియ్యాన్ని గోదాములకు తరలించి, అక్కడ పాలిష్ పట్టి సన్న బియ్యం సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.సరిహద్దులు దాటి భారీ వాహనాల ద్వారా ఈ బియ్యాన్ని పొరుగు రాష్ట్రాలకు మరియు విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. **ప్రజా ధనం వృథా – పేదలకు అన్యాయం** ప్రభుత్వం వేల కోట్ల రూపాయల సబ్సిడీ భారాన్ని మోస్తూ పేదల కోసం ఈ బియ్యాన్ని సరఫరా చేస్తోంది. కానీ, ఈ అక్రమ దందా వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోవడమే కాకుండా, ప్రజా ధనం దుర్వినియోగం అవుతోంది.నాణ్యమైన బియ్యం రాకుండా,అక్రమార్కుల వద్దకు చేరుతుండటంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యేక టాస్క్ ఫోర్స్ రేషన్ దందాపై తక్షణమే ఒక సమగ్ర విచారణ జరిపి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి. **అధికారుల బాధ్యత:** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.రాజకీయ ప్రమేయం ఈ దందా వెనుక ఉన్న రాజకీయ శక్తులను బట్టబయలు చేసి, చట్టం ముందు నిలబెట్టాలి.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి,పేదల బియ్యాన్ని దోచుకుంటున్న ముఠాల ఆటకట్టించాలని పౌర సమాజం కోరుతోంది.

# పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ మదుపల్లి - 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేసిన ఎల్ఐసి రంగారావు



**మధిర ప్రజా జ్యోతి** మున్సిపాలిటీ పరిధిలో మడుపల్లి హైస్కూల్ లో 10వ తరగతి పరీక్షలు వ్రాయబోయే విద్యార్థిని విద్యార్థులకు మధిర ఎల్ఐసి రంగారావు మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వేమిరెడ్డి నాగలక్ష్మి సంయుక్తంగా పరీక్ష సామాగ్రిని అందజేశారు.ప్రతి విద్యార్థికి పరీక్ష పాడ్, పెన్స్, జామెట్రీ బాక్స్, పెన్సిల్, షార్ప్నర్, స్కేల్,స్వీట్స్ అందించడం జరిగింది. గత మూడు సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా మడుపల్లి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందిస్తూ విద్యార్థులు అందరూ పాస్ కావాలని,మంచి మార్కులు సాధించాలని దీవిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్న శాఖమూడి రంగారావు ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించారు.రంగారావు మాట్లాడుతూ విద్యార్థులంతా చక్కటి క్రమశిక్షణతో, నిర్భయంగా ఈ పరీక్షలో తమ యొక్క ప్రతిభను చూపి తల్లిదండ్రులకు, గ్రామానికి ,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ మండల , జిల్లా స్థాయిలో మడుపల్లి పాఠశాలను ఆదర్శంగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఏ ఏ పీ సి చైర్పర్సన్ వేమిరెడ్డి నాగలక్ష్మి విద్యార్థులంతా 100% ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో ఉండాలని, శుభాకాంక్షలు అందిస్తూ ఆశీర్వదించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు విద్యార్థులందరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించే ఈ పదవ తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాల కోసం నిరంతరం కృషి చేస్తూ అన్ని పరీక్షలను విజయవంతంగా రాయాలని, ఉపాధ్యాయుల కృషికి తోడుగా, విద్యార్థుల కృషి కూడా జత చేసి మండలంలో జిల్లాలో పిఎం శ్రీ మడుపల్లి పాఠశాలకు మంచి స్థాయిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, భూసా కోటేశ్వర రావు కంచిపోగు ఆదాం సముద్రాల శైలజ శర్మ సాములు జ్యోతిర్మయి సంధ్యలక్ష్మి పైడిపల్లి కిషోర్ జ్ఞానేశ్వర్ చారి శ్రీదేవి పదవ తరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి కరెంట్ షాక్ తో మృతి పొందిన వ్యక్తి

- అక్రమంగా కరెంట్ వైర్లను కాలువలోకి పంపి చేపలకు షాక్ ఇస్తుండగా ప్రమాదం



**వేంసూరు మార్చి 11 ప్రజాజ్యోతి** వేంసూరు మండలం కల్లూరుగూడెం చెందిన వెలిశాల వెంకటేశ్వరరావు, రేగుల నాగేశ్వరరావు మరియు వీరవెంకి పుల్లయ్య అనే వ్యక్తులు వాసం లక్ష్మయ్యను చేపలు పడదామని కల్లూరుగూడెం సమీపంలోని కాలువ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ, సమీపంలోని మోటార్ బోర్డు నుండి అక్రమంగా విద్యుత్ వైర్లను కాలువలోకి లాగి, చేపలకు కరెంటు షాక్ ఇవ్వడానికి ప్రయత్నించారు. బాధితుడు కాలువలోకి దిగుతుండగా, నిందితులు విద్యుత్ సరఫరాను ఆన్ చేయడం వల్ల, లక్ష్మయ్య విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మరణించారు. ఫిర్యాదుదారుని సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అక్రమ విద్యుత్ వినియోగం మరియు నిర్లక్ష్యంగా వ్యవహరించి వ్యక్తి మరణానికి కారణమైన వెలిశాల వెంకటేశ్వరరావు, రేగుల నాగేశ్వరరావు మరియు వీరవెంకి పుల్లయ్యలపై కేసు నమోదు చేశాము. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పేదల ఆరోగ్యమే మా ప్రాధాన్యత

- సర్పంచ్ పకృద్దీన్
- వేంసూరులో ఘనంగా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' ఆరోగ్య శిబిరం
- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచ్ పకృద్దీన్, ఉప సర్పంచ్ కొండలరావు
- శిబిరంలో 213 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ





**వేంసూరు, మార్చి 11(ప్రజాజ్యోతి )**నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వేంసూరు సర్పంచ్ పకృద్దీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ ఈడ కొండలరావు తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాల్లోని పేద ప్రజలు ఖరీదైన వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, నిపుణులైన జిల్లా స్థాయి డాక్టర్లను ఇక్కడికే పిలిపించి ఉచితంగా పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు.ఈ శిబిరంలో ఖమ్మం జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు సేవలు అందించారు. డాక్టర్ బి. పార్వతి (గైనకాలజిస్ట్) డాక్టర్ ఆర్. చైత్ర (పిల్లల వైద్యులు ) డాక్టర్ ఎస్. నరేష్ (దంత వైద్యులు ) డాక్టర్ జి. వరుణ్ కుమార్ (ఎముకల నిపుణులు ) డాక్టర్ పి. అశ్విని కృష్ణ (కంటి నిపుణులు ) డాక్టర్ ఎస్. సునీల్ (జనరల్ మెడిసిన్)వీరితో పాటు స్థానిక PHC వైద్యులు డాక్టర్ కె. ఇందుప్రియాంక, డాక్టర్ పి. శ్రీవిద్య మరియు సిబ్బంది రోగులకు సేవలందించారు.శిబిరానికి వచ్చిన మొత్తం 213 మంది రోగులకు సర్పంచ్ సమక్షంలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు: కంటి వైద్యం: 55 మంది సాధారణ వైద్యం: 39 మంది మహిళా & శిశు సేవలు: 68 మంది (34+34) దంత & ఎముకల సేవలు: 51 మంది (27+24)ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సర్పంచ్ మరియు వైద్య బృందానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్వాడి కేంద్రాలను పరిశీలించిన సిడిపిఓ సిహెచ్ నిర్మల జ్యోతి



**కల్లూరు మార్చి 11 ప్రజా జ్యోతి** కల్లూరు మండల కేంద్రం రఘునాథ గూడెం గ్రామం లోని అంగన్వాడి కేంద్రాలను ఐ సి డి ఎస్ అధికారి సిడిపిఓ సిహెచ్ నిర్మల జ్యోతి చంద్రుపట్ల సెక్టార్ సూపర్వైజర్ సుజాత పరిశీలించారు. లంబాడా తండ అంగన్వాడి కేంద్రం నందు ఆరోగ్య లక్ష్మి కమిటీ సర్పంచ్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలని తల్లులు పిల్లలు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా నిర్మూలించాలని గ్రామస్తులకు సూచించారు. రక్త హీనత ను నివారించాలని తల్లులు లకు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుక్క సుధారాణి, వైస్ సర్పంచ్ కర్నాటి కోటేశ్వరమ్మ , వార్డు మెంబర్లు నాగవేణి గ్రామ పెద్దలు కుక్క రాణా, వెంకటేశ్వర్లు, లాలు, రవి, సూపర్వైజర్, ప్రియాంక, రేవతి, ఆశలు సావిత్రి, శారద, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# వేపకుంట్ల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**రఘునాథపాలెం ప్రజా జ్యోతి**రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థులంతా కలిసి బుధవారం ఘనంగా పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, ఆట పాటలతో అలరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సా ధించడం, పరీక్ష విధానం, మెళకువలపై హెచ్ఎం గాయత్రి తో పాటు ఉపాధ్యా యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, అందజేశారు అనంతరం ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్ఎం గాయత్రి , ఉపాధ్యాయులు రమేష్, రమాదేవి, సోమల, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని వీడ్కోలు సమావేశం చేశారు.

# బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో





**కల్లూరు మార్చి 11 ప్రజా జ్యోతి** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదువు ఆరోగ్య పరిరక్షణ పట్ల హెచ్ ఎం లు, వార్డెన్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి. చంద్రశేఖర్అన్నారు. బుధవారం కల్లూరు డివిజన్ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను కల్లూరు ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటశాల కూరగాయలు భద్రపరిచే గదిని, విద్యార్థినిలకు వండిన ఆహారాన్ని పరిశీలించి విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజు ప్రభుత్వం మెనూ ప్రకారం ఆహారము అందిస్తున్నది లేనిది విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వండిన ఆహారము ముందుగా సంబంధిత సిబ్బంది తిన్న తర్వాతనే విద్యార్థినిలకు వడ్డించాలని అన్నారు. పిల్లలకు వంట చేయడానికి అందించే ఆహార సామాగ్రి పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే వంట చేయు సిబ్బందికి అందజేయాలని, వంట చేయు సిబ్బంది తగ్గిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.. హెచ్ ఎం ఉపాధ్యాయులు అందరూ స్థానికంగా ఉండాలని, ఏ ఎన్ ఎం ప్రతిరోజు విద్యార్థినిల యొక్క ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం శ్రీనివాస్ నాయక్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.